# వేట

రెండు గంటలు పట్టినా మెరుపులాంటి ప్లాను తట్టినందుకు మిత్రత్రయం ఆనందపడింది. వేట ఫలించి తీరుతుందని గట్టి నమ్మకం కుదిరింది. "రెడీ" అనుకున్నారు.

ఉమెన్స్ కాలేజీ టౌన్‌కి కొంచెం దూరంలో వుంది. రోడ్డు కటూ యిటూ రెండు బస్‌స్టాపులున్నాయి. ముగ్గురిలో అందంగావుండే ఆదిత్య జట్టుకి నాయకుడు. అతని వెంట వుండేది రఘు. సాధువుగా కనిపించే సత్యం తర్వాత సినిమా ఫక్కీలో రంగ ప్రవేశం చేయాలి. వేటలో దొరికే బేబీని మాటల్లో పెట్టి మచ్చిక చేసుకునేందుకు టౌను మొదట్లో వుండే రఘు రూమ్‌కి తీసుకురావాలి.

ఆదిత్య, రఘు బస్ స్టాప్ దగ్గరగా కాపు కాశారు. అక్కడున్న ముగ్గురమ్మాయిల్లో అందంగా వున్నది. ఒక్కరే అడపిల్లల్లో అందం తగ్గిపోతున్నందుకు జాలిపడ్డారు. ఒక బస్సు రాగానే ఇద్దరమ్మాయిలు ఎక్కి టాటా చెప్పి వెళ్ళిపోయారు. మిత్రులు సంబరపడ్డారు.

ఆలస్యం చేయకుండా కథా క్రమం ఆరంభించారు జోరుగా. చూపుల్తో గుచ్చుతున్నారు. మాటల్తో నమిలేస్తున్నారు. అమ్మాయి నిస్పృహాయంగా బస్సువచ్చే వైపు చూస్తోంది. ఎవరన్నా వస్తే లిస్ట్ అడిగి తప్పించుకుందామనుకునే వరకు లాక్కొచ్చారు కథని. నిమిషాల్లో అనుకున్న ప్రకారం అంతదూరంలో సత్య స్కూటరు చూడగానే ఏమీఎరగనట్లు అవతలికెళ్ళిపోయారు. అయినా నాగమని చూస్తూనే వున్నారు.

సత్యం, ఆ అమ్మాయి ఏదో మాట్లాడుకుంటున్నట్లుంది. స్కూటరువెనక కూర్చుంది. ప్లాన్ అద్భుతంగా నడుస్తున్నందుకు వుబ్బి తబ్బిబ్బయ్యారు. కలలు కంటూ పరుగులాంటి నడకతో రఘు రూమ్ వైపు బయల్దేరారు, బస్సుకోసం నిరీక్షించేంతటి సహనంలేకపోవడంచేత.

రూం చేరారు. సత్యం, అమ్మాయిజాడ లేదు. బిత్తర పోయారు. హాండిచ్చి వుంటాడా అన్న సందేహం మొదలయింది.

ఆ అమ్మాయి సత్యం చెల్లెలని, నిజంగా తమలాంటి కిరాతకుల చేతుల్లో పడితే తన చెల్లెలేమై వుండేదోనని సత్యం తల్లడిల్లిపోతున్న సంగతి వాళ్ళకి తెలియదు. అంతేకాదు, సత్యం మారాడని, యింకెప్పుడూ వేటకి రాడని, వేటాడే వాళ్ళని నిలువునా పాతేస్తాడని కూడా వాళ్ళకి తెలియక వదలని ఆశతో నిరీక్షిస్తున్నారు.